

మారేడ్‌పల్లి : మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్

# అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

మారేడ్‌పల్లి, జూన్ 25 : కంటోన్మెంట్‌కు అధిక నిధులు కేటాయించాలని కోరుతూ.. మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బోనాల నేపథ్యంలో బస్తీలు, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు, కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

### క్రీడాకారులకు సహకారం అందిస్తా..

హైదరాబాద్ డిస్ట్రిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి ఎం. సుధాకర్ రావు ఆధ్వర్యంలో జింఖానా మైదానం కోచ్‌లు, క్రీడాకారులు మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌ను కలిశారు. జింఖానా మైదానంలో సౌకర్యాలు, అభివృద్ధి, క్రీడాకారులకు అన్ని విధాల సహకారం అందించాలని వారు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులకు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కంటోన్మెంట్ ఉన్న క్రీడా మైదానాలను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్ర , జాతీయ స్థాయిల్లో గెలిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించడంతో పాటు మెడల్స్, ధ్రువపత్రాలు అందజేశారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

బొల్లారం,జూన్ 25 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. మంగళవారం రెండో వార్డు పరిధిలోని అన్నానగర్ బస్తీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.



ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌ను సన్మానించిన స్పోర్ట్స్ అధికారి సుధాకర్‌రావు

స్థానికులు ఓపెన్ నాలా, డ్రైనేజీ,వీధి దీపాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బస్తీవాసులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధికి సహకరించాలి



కంటోన్మెంట్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు మూల్యా సంజీవ్ మంగళవారం బోర్డు సీఈఓ ముఖ్య కార్యనిర్వహణాధికారి హనీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేసుకోవడం తప్పు.. నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వాలు కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

- బొల్లారం

## ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండి..

జూబ్లీహిల్స్, జూన్ 25 : క్షేమంగా గమ్యానికి చేర్చే ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించండం టూ.. మంగళవారం ఆర్టీసీ కళాకారులు నగరంలోని జేబీఎస్‌లో కళారూపాలు ప్రదర్శించారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితం.. సుఖవంతం అంటూ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఉచిత బస్ నేపథ్యంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాటించాల్సిన నిబంధనలు తెలిపారు.




## కేసీఆర్‌ను కలిసిన విద్యార్థి నాయకుడు



ఉస్మానియా యూనివర్సిటీ : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా నాగయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.

## బోనాలకు గుర్తింపు తెచ్చింది బీఆర్‌ఎస్సే

బేగంపేట్ జూన్ 25: ఆషాఢ బోనాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాలను రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించి ప్రభుత్వం అధ్వర్యంలో నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆలయాలు అని తేడా లేకుండా అన్ని దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. ఈ సంవత్సరం బోనాల నిర్వహణకు ప్రభుత్వం అందించే ఆర్థిక



సహాయం కోసం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల కమిటీ సభ్యులు రెండు రోజుల్లోగా దేవదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

## స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

అడ్డగుట్ట, జూన్ 25 : స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని డిప్యూటీ ఐఏఎస్ మదన్ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మెట్టుగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో డబ్ల్యూపీపీ స్వచ్ఛంద సంస్థ సికింద్రాబాద్ చారిటీ ఈవెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మదన్‌మోహన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి చిన్నారులకు నోట్‌పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున్, డబ్ల్యూపీపీ టీం సభ్యులు సుధాకర్, ప్రిన్స్, టీచర్లు మల్లీశ్వరి, నాగశృతి పాల్గొన్నారు.



చిన్నారులకు నోట్‌బుక్స్ అందించిన మదన్ మోహన్, డబ్ల్యూపీపీ టీం సభ్యులు

### కామర్స్ కళాశాలలో..
## ప్లాంటేషన్ డ్రైవ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25 : ఓయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మంగళవారం ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు పుట్టినరోజు సందర్భంగా పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, కళాశాల ఆవరణలో 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటయ్య, గంగాధర్, సుధ, చెన్నప్ప, కృష్ణచైతన్య, నరేశ్‌రెడ్డి, జహంగీర్, కవితాదేవి, ప్యాట్రిక్, శ్రీనివాస్, విద్యాసాగర్‌రావు, సమున్నత, తిరుపతి, పరిశోధక విద్యార్థులు మహేశ్, నాగరాజు, మహేశ్, మారం శ్రీనివాస్, సారిక, సంగీత పాల్గొన్నారు.



## సూత్ర ఎగ్జిబిషన్ షురూ..



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న బినా మెహతా

జూబ్లీహిల్స్, జూన్ 25: ఆధునిక సంప్రదాయాల మేళవింపుతో ఏర్పాటుచేసిన ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో ప్రముఖ సామాజికవేత్త బినా మెహతా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన డిజైనర్లు, వ్యాపారవేత్తలు ఒకే వేదికపై ఉత్పత్తులు, కలెక్షన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా భారతీయ దుస్తులు, ఆభరణాలు, వెస్టన్ వేర్, హ్యాండ్లూమ్స్, క్యాస్టూమ్స్‌తో పాటు గృహోపకరణాలు, పాదరక్షల వంటి వేలాది రకాల ఉత్పత్తులు ఒకే వేదికపై లభ్యమవుతాయని తెలిపారు. ఈ నెల 27 వరకు నిర్వహించే ఈ ప్రదన్శనలో 70 స్టాల్స్‌లో 25 వేలకు పైగా తాజా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## బస్సు పాసుల జారీకి 43 కేంద్రాలు

సిటీబ్యూరో, జూన్ 25 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో 43 బస్సుపాస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఈడీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులు, జేఎన్‌టీయూ విద్యార్థుల కోసం కొత్తగా జేఎన్‌టీయూ బస్‌స్టాపులో కౌంటర్ తెరిచామని చెప్పారు. ఈ కేంద్రాలు ఉదయం 6:30నుంచి రాత్రి 8:15 గంటల వరకు సేవలందిస్తాయన్నారు. గ్రీన్ మంత్లీ ఏసీ బస్సు పాస్‌లు కూడా జారీ చేస్తున్నట్టు వివరించారు. కాగా డిమాండ్ దృష్ట్యా మొబైల్ వెహికిల్ బస్సు పాస్ సేవలను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ‘బొల్లిమచ్చలు అంటువ్యాధి కాదు’

**గాంధీ దవాఖాన డి.వి.ఎల్. విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సి.సుధారాణి**

బన్సీలాల్‌పేట్, జూన్ 25 : బొల్లి మచ్చలు అంటువ్యాధి కాదని, సాధారణ చర్మవ్యాధి అని గుర్తించాలని గాంధీ దవాఖాన చర్మ, లైంగిక, లెప్రసీ (డి.వి.ఎల్.) విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సి.సుధారాణి అన్నారు. ‘ ప్రపంచ విటిలిగో డే ’ సందర్భంగా ఏఐడీవీఎల్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డి.వి.ఎల్. విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. తెల్లమచ్చలు రావడానికి మెలనోసైట్ రసాయనం ఉత్పత్తి కాకపోవడమే కారణమన్నారు. దాని వలన చర్మం సహజరంగు కోల్పోతుందని, తెల్లని మచ్చలు ఏర్పడతాయని తెలిపారు. అన్ని తెల్లమచ్చలు బొల్లి కాదని తెలుసుకోవాలన్నారు. డి.వి.ఎల్. విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘుకిరణ్ మాట్లాడుతూ.. ఇక్కడ ఫొటోథెరపీ, టాపికల్, సిస్టమిక్ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి శుక్రవారం ఇక్కడ విటిలిగో క్లినిక్‌కు రావొచ్చని, అనుభజ్ఞులైన వైద్యులు ఆరోగ్య సలహాలు, చికిత్స, మందులు ఉచితంగా ఇస్తారని ఆయన అన్నారు. మెలనిన్ ఉత్పత్తి పెంచే మందులు, స్టెరాయిడ్స్ క్రీములు, యు.వి.బి. థెరపీ ద్వారా విటిలిగో వ్యాధికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ శంకర్, డాక్టర్ సత్తయ్య, డాక్టర్ సౌమ్య, డాక్టర్ శాంభవి పాల్గొన్నారు.




‘ ప్రపంచ విటిలిగో డే ’ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించిన డి.వి.ఎల్. వైద్యులు

## వినోద్‌కుమార్‌కు విద్యారత్న అవార్డు



విద్యారంగంలో ముఖ్యంగా న్యాయవిద్యలో సంస్కరణలు తీసుకువచ్చి, అంతర్జాతీయ స్థాయిలో ఉస్మానియా యూనివర్సిటీ ఖ్యాతిని పెంపొందించినందుకు గాను ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌ను విద్యారత్న అవార్డు వరించింది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఇన్సానియత్ కిడ్‌మత్ సంస్థ ఈ అవార్డును వినోద్‌కుమార్‌కు ప్రదానం చేసింది. తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తొలి చైర్మన్ జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.

- ఉస్మానియా యూనివర్సిటీ



క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్‌కు చెందిన హ్యాండ్ బాల్ ఇండియా టీం కోచ్ బైరు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఓపెన్ సెంట్రల్ ఏషియన్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలలో ఇండియా టీం కాంస్యం సాధించింది. ఈ సందర్భంగా బాలకృష్ణను ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ వాసులు బాబూరావు, కొండల్, ఉపేందర్ పాల్గొన్నారు.

- కవాడిగూడ

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



మైలార్‌గడ్డలో అధికారులతో కలసి పర్యటిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, జూన్ 25 : తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. మంగళవారం ఉప్పర్ బస్తీ, మేడి బావి, బ్రాహ్మణ బస్తీ ప్రాంతాల్లో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. సీసీ రోడ్లను పరిశీలించి నూతన రోడ్లకు ప్రపోజల్స్ పంపాలని జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్‌ని ఆదేశించారు. కలుషిత నీరు వస్తుందని కార్పొరేటర్ హేమకు స్థానికులు ఫిర్యాదులు చేయగా వాటర్ వర్క్స్ మేనేజర్ అన్విత్‌తో తనిఖీ చేయించారు. నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకొని త్వరగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మైలర్ గడ్డ, వెంకటేశ్వర నగర్, ఇందిరా నగర్ రోడ్ నం. 2 ప్రాంతాల్లో నూతన రోడ్లు మంజూరు అయినట్లు త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

## తాగునీటి సమస్యను పరిష్కరిస్తా..



కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రెండో వార్డు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్యాంసన్ రాజు అన్నారు. మంగళవారం వార్డులోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నీటి సమస్యపై నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పోరాటం చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎమ్మెల్యే శ్రీ గణేశ్ నేతృత్వంలో ప్రభుత్వం, బోర్డు అధికారులతో చర్చలు జరిపి ఉచిత నీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటాన్నరని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేశ్ యాదవ్, నాగరాజు, మురళి, ధర్మేందర్, బబిత, అలివేలు, రంగమ్మ పాల్గొన్నారు.

- బొల్లారం

## కళాశాల గుర్తింపు రద్దు చేయాలి



కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఓయూజేఏసీ, టీఎస్‌జేఏసీ డిమాండ్ చేసింది. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. టీఎస్‌జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరినాయక్ మాట్లాడుతూ.. ఫోర్జరీ డాక్యుమెంట్లు, సంతకాలతో నాలా సర్టిఫికెట్ సృష్టించి, 2007లో ఏఐసీటీఈ, వర్సిటీ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 2008 నుంచి ఇప్పటి వరకు అధికారుల అండదండలతో నడుపుతున్న సదరు కళాశాల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ నాయకులు శివరాత్రి ప్రశాంత్, తూము నవీన్‌యాదవ్, లక్‌పతినాయక్, తాడెం రాజేశ్ పాల్గొన్నారు.

- ఉస్మానియా యూనివర్సిటీ

## వాయిదాపడిన బీకాం ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25 : ఓయూ పరిధిలో వాయిదా పడిన బీకాం ఆరో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా తేదీని ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. 2017, 2018 బ్యాచ్‌లకు చెందిన రీ – అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు 13న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసిన విషయం తెలిసిందే. పరీక్షను తిరిగి వచ్చే నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. వివరాలకు వెబ్‌సైట్ www. osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

## ఐదేండ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

**IN THE COURT OF THE HONBLE III RD ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM X ADDL M.M. MEDCHAL. At: Medchal.**
O.S.No.: 396 of 2023
Between:
K.Bhagavandas ... Plaintiff
AND
K.Sudershan and two others ... Defendants
**Summons to Defendant No.1**
To,
1. K.Sudershan, S/o. Late K.Rajaiah, aged about 64 years, Occ: Retired railway employee, R/o. No. 885, Sadar Bazar,Bollaram Bazar, Secunderabad - 500010.
Take Summon that the above-said plaintiff had filed suit for specific performance of an Agreement of sale against you and two others, and above said suit was posted for your appearance. You are hereby directed to appear in person or through your Counsel on 09-08-2024, at 10:30 A.M before the Hon'ble court, failing which the Hon'ble court will decide the matter in your absence and pass orders.
By Court Order
Sd/- **S.Yadagiri, Sattari Manoj**
Advocates,
Padmashree enclave Kandlakoya (v), Medchal Mandal and Dist.
**Ph. 9502981108.**